కథ

మనుషులు మారిపోతారు.
ఊళ్ళు మారిపోతాయి.
ఊహించని సంఘటనలు సమాజాన్ని కుదిపేస్తాయి.
అయినా మనుషుల జీవనయానం ఆగదు.
ఈ ప్రయాణంలో కొన్ని జ్ఞాపకాలు, సంప్రదాయాలు ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమిస్తాయేమో!
ఎవరూ చెప్పకుండానే కొన్నిటిని అనుసరిస్తారేమో!

"శ్రావణమాసం నోములు రేలంగిలో చేసుకుంటే ఎలా వుంటుంది పిన్నీ"

నెలరోజుల క్రితం అక్క కూతురు శృతి ఫోన్‌చేసి అడిగినప్పుడు శ్రావణి ఆశ్చర్యపోయింది.

బెంగుళూరు ఐటి ప్రపంచంలో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌గా పనిచేస్తున్న శృతికి ఇలాంటి ఆలోచన ఎలా వచ్చిందన్న ప్రశ్న ఆమె మెదడులో కొన్నిరోజులపాటు తిరుగాడింది.

చరిత్ర పాఠాలు చెప్పే శ్రావణికి వెంటనే జవాబు దొరకలేదు. కానీ ఆమె ప్రమేయం లేకుండానే రేలంగి ప్రయాణానికి ఏర్పాట్లన్నీ సిద్ధమయ్యాయి. తన తల్లితోపాటు శ్రావణి, ఆమె అక్క లక్ష్మి, ఆమె కూతురు శృతి సికింద్రాబాద్‌లో గౌతమీ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు.

# అంతర్ముఖం

వై.వసంత

** ** **

సోమవారం తెల్లవారుజామున అయిదు గంటలకు నిడదవోలులో ఆగింది రైలు. అక్కడ దిగి టాక్సీ మాట్లాడుకుని రేలంగి బయలుదేరారు.

టాక్సీ ఊరిలోకి ప్రవేశించింది."శ్రీలక్ష్మి" సినిమా హాలు వచ్చింది.

రోడ్డు మలుపు తిరిగిన తర్వాత వీరభద్రస్వామి పెద్ద గుడి, దానిముందువున్న దాదాపు యాభై అడుగుల ఎత్తులో వున్న రెండు ఉయ్యాల స్తంభాలు. ఈ మధ్యన రంగులు వేసినట్లున్నారు. కొత్తగా వున్నాయి. ఊరంతా ఇరుకైనట్టుగా వుంది. రోడ్డుకు అటూ ఇటూ పెంకుటిళ్ళు, తాటాకుల ఇళ్ళ స్థానంలో దాబాలు వచ్చేసాయి.


"ఈ ఏరియా ఇరవైరెండు సంవత్సరాల క్రితం ఊరు చివర. ఇప్పుడు ఊరు మధ్యలో వున్నట్టు వుంది. ఊరెంత పెరిగిపోయిందో చూడండి" అంది శ్రావణి అమ్మ.

"మీ ఊర్లో దీపావళికి, వైశాఖ అమావాస్యకి జరిగే అమ్మవారి జాతర్లకి అమ్మవారి విగ్రహాలు ఈ ఉయ్యాల స్తంభాలకే పెద్ద ఊయల కట్టి ఊపుతారని చెబుతుంటావు కదా! అవే ఇవా?" అని అడిగింది శృతి.

"అవును. ఇక్కడకు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో గోస్తనీనది వుంది. అక్కడ విశ్వామిత్రుడు యాగం చేసినప్పుడు ఆ యాగంలోంచి పుట్టినవారే పెద్ద మంటలమ్మ, చిన్నమంటలమ్మ. మంటల్లోంచి పుట్టారు కాబట్టి వారికి ఆ పేరు వచ్చింది. వాళ్ళే ఈ ఊరి గ్రామ దేవతలు. ఆ ప్రదేశంలో ఇద్దరు అమ్మవార్లకు విడివిడిగా పెద్దపెద్ద గుడులు వున్నాయి." చెప్పింది.

"ఇది జిల్లా శాఖాగ్రంథాలయం. దీన్ని నేను ఇంటర్ చదువుతున్నప్పుడు పెట్టారు. దీంట్లో ఇరవై రూపాయలు కట్టి మెంబర్‌షిప్ కార్డు తీసుకున్నాను. రెండు నవలలు ఇచ్చేవారు. మీ అమ్మ, పెద్దమ్మలు రెండు రోజుల్లో చదివేసేవారు. మర్నాడు మళ్ళీ లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు తెమ్మని సతాయించేవారు" చెప్పింది గ్రంథాలయం కల ఎత్తు అరుగులు వున్న పెద్ద పెంకుటిల్లును చూపించి- శ్రావణి శృతితో.

"నువ్వు చదివేదానివి కాదా?" అడిగింది శృతి.





కథా నిలయం
శ్రీకాకుళం

పడక గదిలో ఒక పందిరి మంచం, హాల్లో ఒక మంచం తప్ప ఇల్లంతా ఖాళీగానే వుంది. ఇంటికి సున్నాలు వేయించి, అలికించి, సున్నం, బెల్లం కలిపి ముగ్గులు వేయించింది పిన్ని. చాలా కళ వచ్చింది. గుమ్మాలకు వున్న పచ్చటి మామిడాకుల నుంచి వచ్చే కమ్మటి పరిమళాలు ఆహ్లాదాన్నిస్తున్నాయి.

"సెలవుల్లో చదివేదాన్ని. అయినా మీ అమ్మ అంత ఫాస్ట్ కాదులే నేను. విశ్వనాథ సత్యనారాయణగారి వేయిపడగలు నవలని మీ అమ్మ వారం రోజుల్లో చదివితే నాకు మూడు వారాలు పట్టింది" మధురమైన ఆ రోజుల్ని గుర్తుచేసుకుంటూ అంది శ్రావణి.

బయటకు చూస్తున్నదల్లా వున్నట్టుండి-

"ఏయ్! అమ్మలూ ఇటు చూడు.... ఈ మేడ డాక్టర్ శ్రీరామమూర్తిగారిది. మీ అన్న, నువ్వు ఇక్కడే పుట్టారు. తాతగారికి పక్షవాతం వచ్చినప్పుడు రెండు నెలలు ఈ ఆసుపత్రిలోనే వున్నారు. అప్పటి నుంచి డాక్టర్‌గారు మన ఫ్యామిలీ ఫ్రెండ్ అయిపోయారు. చాలా మంచివారు. నేను లైబ్రరీకి ఈ ఆసుపత్రి ముందునుంచే వెళ్ళేదాన్ని. నేను వెళ్ళడం డాక్టర్‌గారు చూసేవారు. ఎప్పుడైనా ఆసుపత్రి లోపలికి వెళితే 'ఏం అమ్మా! లైబ్రరీలో పుస్తకాలన్నీ చదవడం అయిపోయిందా?' అని అడిగేవారు నవ్వుతూ."

"............"

"ఈ వీధి 'తంగిరాలవారి వీధి' ఇక్కడ తంగిరాల సిద్ధాంతిగారి రెండు కుటుంబాలు వుంటాయి. అలాగే ఈ వీధిలో వున్నవారు చాలామంది తంగిరాల వారే" అని చెప్పింది లక్ష్మి- అటు, ఇటూ పెంకుటిళ్ళు, మధ్యమధ్యలో డాబాలు, ప్రతి ఇంటి ముందు చెట్లు వున్న ఒక వీధిలోకి టాక్సీ ప్రవేశించగానే.

"ఇక్కడ ఎంత ప్రశాంతంగా వుందో కదా?' అంది శృతి తల బయటకు పెట్టి తన్మయత్వంతో.

"ఈ పక్కవీధే మన అగ్రహారం. అది ఇంకా బాగుంటుంది" అంది లక్ష్మి.

ఇటు పదమూడు ఇళ్ళు... అటు పదమూడు ఇళ్ళు.... వున్న పెద వీధి. అన్నీ బ్రాహ్మల ఇళ్లే. వీధి మొదట్లో వున్న ఇంటి ప్రహరీ గోడకు 'అగ్రహారం' అన్న బోర్డు వుంది. ప్రతి ఇల్లు దాదాపు ఎనిమిది నుంచి వెయ్యి గజాల స్థలంలో వున్నాయి. ఇరవై రెండు సంవత్సరాల క్రితం అన్నీ పెంకుటిళ్ళే వుండేవి ఈ వీధిలో. ఇప్పుడు కొన్ని ఇళ్ళు డాబాలు అయ్యాయి. రోడ్డుకు పక్కగా పెద్ద బావి. అక్కడే ఆ చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు నీళ్ళు తోడుకునేవారు. ప్రతి ఇంటికి దొడ్లో నుయ్యి వుంటుంది. అయినా కూడా ఈ బావిలో నీళ్ళు తియ్యగా వుంటాయని వీటినే తాగేవారు. ఇప్పుడు అందరి ఇళ్ళల్లో కుళాయిలు వున్నాయి.

రోడ్డుకు ఈ చివర పాలైగారి పెద్ద మేడ, ఆ చివర రాజుల పెద్దమేడ అగ్రహారాన్ని రక్షించే కోట గోడల్లా వుంటాయి."

దాదాపు వీధి చివరి వరకు వచ్చింది టాక్సీ. "ఇక్కడ ఆపు" అంది లక్ష్మి- పెద్ద గేటు, సిమెంట్ ఆర్చి వున్న ఇంటి దగ్గరకు వచ్చిన తర్వాత.

అందరూ దిగి, సామాన్లు తీసుకుని లోపలకు మెట్లెక్కి అరుగు మీదకు వచ్చారు.

"రండి... రండి..." అంది శ్రావణి వాళ్ళ పిన్ని పక్కవాటాలోంచి వస్తూ.

సింహద్వారానికి వున్న తలుపు గడియ తీసింది. అందరూ హాల్లోకి వచ్చారు. శృతి రెండు కళ్ళు గిర్రున తిప్పుతూ హాలంతా చూసింది.

హాలు విశాలంగా వుంది.

పడక గదిలో ఒక పందిరి మంచం, హాల్లో ఒక మంచం తప్ప ఇల్లంతా ఖాళీగానే వున్నాయి. ఇంటికి సున్నాలు వేయించి, అలికించి, సున్నం, బెల్లం కలిపి ముగ్గులు వేయించింది పిన్ని. చాలా కళ వచ్చింది. గుమ్మాలకు వున్న పచ్చటి మామిడాకుల నుంచి వచ్చే కమ్మటి పరిమళాలు ఆహ్లాదాన్నిస్తున్నాయి.

"నిన్న మంచిరోజు కదా అని గుమ్మాలకున్న పాత తోరణాలు తీయించి కొత్త తోరణాలు కూడా నిన్నే కట్టించాను. తర్వాత చూద్దురుగాని ముందు కాళ్ళు కడుక్కుని రండి కాఫీ ఇస్తాను" అంది.

స్నానాలు, భోజనాలు అయ్యాయి. రెండు గంటలు విశ్రాంతి తీసుకున్నారు.

"అమ్మాయీ శనగలు ఇలా తీసుకురా, బాగుచేద్దాం" అంది అమ్మ.

"బాగుచేయడానికి ఏంలేవు. అక్కడక్కడ రాళ్ళు వున్నాయంతే. నిన్న నేను ఏరేశాను" అంది పిన్ని.

"శ్రావణీ... నువ్వు... శృతి విరజాజి మొగ్గలు కోయండి. మాల కడతాను. రేపు పొద్దున్న పూజకు పనికివస్తాయి. ఇప్పుడు మీరు పేరంటం పిలవడానికి వెళ్ళినప్పుడు తలలో పెట్టుకోవచ్చు" అంది లక్ష్మి.

నిచ్చెన, స్టూలు ఇద్దరు తలొకటి పట్టుకొని బయటకు వచ్చారు. గుబురుగా ఆర్చీమీదకు పాకి వున్న విరజాజి చెట్టుకు నిచ్చెనవేసి, కొంగు బొడ్లోకి దోపుకొని నిచ్చెన ఎక్కింది శ్రావణి. పైన వున్న మొగ్గలన్నీ కోసింది. శృతి స్టూలు వేసుకొని గోడ ఎక్కి అక్కడున్న మొగ్గలన్నీ కోసి కవరులో వేసుకొంది. అన్ని మొగ్గలు కోయడానికి ఇద్దరికి దాదాపు గంట పట్టింది.

వాళ్ళను చూడ్డానికి వచ్చిన పక్కింటి నాగమణి, సూరీలు, లక్ష్మి ముగ్గురు కబుర్లు చెప్పుకుంటూ మొగ్గలన్నీ మాలకట్టారు.

కాటన్ తువ్వాలు తడిపి దాంట్లో మాలను చుట్టి శృతికి ఇస్తూ "ఇది తీసుకెళ్ళి దొడ్లో తులసికోట దగ్గర పెట్టు" అంది లక్ష్మి.

"ఇలా ఎందుకు?" శృతి సందేహం వ్యక్తంచేసింది.

"మా చిన్నప్పుడు ఫ్రిజ్‌లు లేవుకదా! మేం ఇలాగే పెట్టేవాళ్ళం. రేపు మధ్యాహ్నం వరకు పువ్వులు తాజాగావుంటాయి" చెప్పింది లక్ష్మి.

"........."

"నాగమణీ! పేరంటం పిలవడానికి వీళ్ళతో వెళతావా?" అడిగింది లక్ష్మి.

"మా ఇంట్లో కూడా పేరంటం వుంది. మా అమ్మాయికి కూడా ఆఖరి సంవత్సరం నోము నోపిస్తున్నాను. అందరం కలిసి వెళ్ళి పిలుచుకొని వస్తాం. ఇంటికెళ్ళి తయారై పిలుస్తాను. మీరు కూడా తయారవ్వండి" అంటూ వెళ్ళడానికి లేచింది నాగమణి.

జీన్స్‌లో, కుర్తా పైజామాలో కనిపించే శృతిని అలా చూసి ముచ్చట పడింది శ్రావణి. ఏదో నాటకం కోసం సంప్రదాయిక దుస్తులు ధరించిన యువతిలా అనిపించి విస్తుపోయింది.

"అలాగే! నువ్వు పిలిచిన అందరినీ వీళ్ళచేత కూడా పిలిపించు. కాలువ దిబ్బమీద, ఉయ్యాలస్తంభాల దగ్గర వున్నవాళ్ళను కూడా పిలవండి. దూరమని మానేయకండి." అంది లక్ష్మి.

"అమ్మలూ! ఆంటీలకు బొట్టు పెట్టు" అని శృతిని పురమాయించింది.

జడవేసుకొని, ముఖం కడుక్కొని, పట్టుచీరలు కట్టుకొని తయారయ్యారు ఇద్దరూ. గంధం, మెరూన్ కలర్ కలనేత వున్న పట్టుచీర కట్టుకుంది శృతి. దానికి మాచింగ్ గాజులు రెండు చేతులకు వేసుకొంది. తల్లో పెద్ద నిరజాజి మాల పెట్టుకొంది. అచ్చమైన తెలుగింటి ఆడపడుచులా నిండుగా వుంది.

జీన్స్‌లో, కుర్తా పైజామాలో కనిపించే శృతిని అలా చూసి ముచ్చట పడింది శ్రావణి. ఏదో నాటకం కోసం సంప్రదాయిక దుస్తులు ధరించిన యువతిలా అనిపించి విస్తుపోయింది.

"తూర్పువైపు వెళ్ళి, అక్కడి నుంచి పిలుపులు మొదలుపెట్టండి. ఏ ఇంట్లో అయినా ఆడవాళ్ళు లేకపోతే గుమ్మానికి బొట్టుపెట్టి, ఇంట్లో ఎవరుంటే వాళ్ళకి చెప్పండి. తాళం వేసి వుంటే పక్కవాళ్ళకి చెప్పిరండి రేపు పేరంటానికి రమ్మని" అంది అమ్మమ్మ.

"అలాగే! నాకు తెలుసు కదా!" అంది శ్రావణి కుంకుమభరిణి, రుమాలు తీసుకొంటూ. చెప్పులు వేసుకొని పక్కనే వున్న నాగమణి వాళ్ళ ఇంటికి వెళ్ళారు.

** ** **

రాత్రి భోజనాలు అయ్యాయి. వంటగది ఆవుపేడతో అలికి ముగ్గులు పెట్టారు. తమకూడా తెచ్చిన వెండి సామాన్లన్నీ ఒకసారి కడిగి, తుడిచి పెట్టుకున్నారు. దేవుడిని పెట్టే ప్రదేశంలో పద్మం ముగ్గు వేసి దానికి పసుపు, కుంకుమతో అలంకరించింది శృతి.

"అమ్మా! అయిదు కేజీల శనగలూ నానపోసేయనా?" అడిగింది లక్ష్మి.

"పొయ్యి. కనీసం అరవై, డెబ్బై వాయనాలైనా అవుతాయి కదా! వినాయకుడిని తలుచుకుని నీళ్ళల్లో శనగలు పోయి. తర్వాత ఇనుప అట్లకాడ పెట్టి ఒకసారి శనగల్ని కలుపు. బాగా నానతాయి. అలాగే అయిదు చెంచాల పసుపు కూడా వేయి. మంచి రంగు వస్తాయి."

"ముత్తయిదువులు అరవై మంది వరకు వుంటారు. పెళ్ళికాని వాళ్ళు కూడా వస్తారు కదా? వాళ్ళకి కూడా శనగల వాయనం ఇస్తాం కదా!".

"అయ్యో ఆడపిల్లలకు ఇవ్వకపోవడం ఏమిటి? తల్లుల కూడా ఎవరైనా చిన్నపిల్లలు వస్తే మట్టుకు ఒక అరటిపండు ఇవ్వండి. పిల్లల్ని ఉత్తి చేతుల్తో పంపించకూడదు" అంది తల్లి.

"ఒక అరటిపండు, అమ్మలు బెంగుళూరు నుంచి తెచ్చిన చాక్‌లెట్లు వున్నాయి. అది ఒకటి ఇద్దాం బాగుంటుంది" అంది లక్ష్మి.

"సరేలే... ఇక పడుకోండి. తెల్లవారు జామునే లేవాలి. చలిమిడికి బియ్యం నానబెట్టుకోవాలి" అంది అమ్మ.

** ** **

స్నానం చేశాక నోముకు కావాల్సిన ఏర్పాట్లు చేయడం మొదలుపెట్టింది శ్రావణి. గంధం, అక్షతలు, చేత్తో కొంచెం పసుపు తీసుకొని పత్తితో దేవుడికి వస్త్రం, యజ్ఞోపవీతంచేసింది. ఆవునెయ్యి కరగబెట్టి రెండు కుందుల్లో వత్తులు వేసి ఆవునెయ్యి వేసింది. పీటకు పసుపురాసి బియ్యం పిండి, కుంకుమతో బొట్లుపెట్టింది. పసుపుతో గౌరీదేవిని చేసి దానికి బొట్టు, పూలదండవేసి అలంకరించింది. వినాయకుడిని పెట్టడానికి పళ్ళెంలో బియ్యం పోసింది. పసుపు వినాయకుడిని చేసింది. తెల్లదారం తో తొమ్మిది పోచలతో మూడు తోరాలు తీసింది. ఒక తోరం గౌరీదేవికి, ఒక తోరం శృతికి, ఒక తోరం వాయనం ఇచ్చిన ముత్తయిదువుకు. వాటికి పసుపు రాసింది. పువ్వులు, మాచుపత్రి ఆకులు వేసి తొమ్మిది ముడులు వేసి తోరాలు తయారుచేసింది. ఇత్తడి అట్లకాడకు ఆవునెయ్యి రాసి ఒక పళ్ళెంలో పెట్టింది కాటుక వేయడానికి.

"బియ్యం నానడం చాలు. చలిమిడికి పిండి కొడతాను. నువ్వు జల్లెడ్డువుగాని రా!" అంది కొబ్బరి చెక్కలు కోరడం అయిపోవడంతో లక్ష్మి.

"మొదలు పెట్టు. పంచామృతాలు కలిపి వచ్చేస్తాను" చెప్పింది శ్రావణి.

చలిమిడి చేయడం అయిన తర్వాత దాన్ని చిన్నచిన్న ఉండలుగా చేశారు. మొదటి సంవత్సరం కాబట్టి అయిదు జ్యోతులు చేసింది. పువ్వు ఒత్తుల్ని ఆవునెయ్యిలో ముంచి దాంట్లో పెట్టింది. బుట్టవాయనం ఇవ్వడానికి గుప్పిటతో అయిదుసార్లు శనగలు తీసి ఒక బుట్టలో పోసింది. దానిపై తమలపాకు వేసి అయిదు చలిమిడి వుండలు పెట్టింది. తమలపాకులు, వక్క, రెండు అరటిపళ్ళు పెట్టి బుట్టవాయనం ఇవ్వడానికి సిద్ధంచేసింది శ్రావణి.

"అమ్మా! పుస్తకం, కళ్ళజోడు ఇవిగో. అమ్మలు చేత పూజ నువ్వే చేయించు. మా అందరిచేత నువ్వే చేయించేదానివి కదా!" అంది లక్ష్మి.

"నువ్వు కాళ్ళకు పసుపు రాసుకొని, పిన్నికి కూడా రాయి. ముఖానికి స్టిక్కరు బొట్టు కాదు. కుంకుమబొట్టు పెట్టుకో" అంటూ తను మిగతా పనులవైపు వెళ్ళింది లక్ష్మి.

ముందు, పసుపు వినాయకుడి పూజచేయించి, రెండు అరటిపళ్ళు నైవేద్యం పెట్టమంది. ఆ తర్వాత మంగళగౌరీదేవికి షోడశోపచార పూజ, తోరపూజ చేయించింది. శనగలు, అరటిపళ్ళు, చలిమిడి, కొబ్బరిచెక్కలు, బత్తాయిలు అమ్మవారికి అవసర నైవేద్యం పెట్టించింది.

"ఇప్పుడు మాట్లాడకుండా జ్యోతులు వెలిగించు. చేత్తో అక్షతలు పట్టుకొని ఇత్తడి అట్లకాడను జ్యోతులపై పెట్టు. మరీ దగ్గరగా కాకుండా అట్లకాడకు కాటుక బాగా పారేలా పెట్టాలి. నేను మంగళగౌరీ వ్రతకథ చదువుతాను. కథ చదవడం అయిన తర్వాత అక్షంతలు నెత్తిమీద వేసుకో" అంది అమ్మమ్మ.

తల్లి శ్రీసూక్తం చదువుతుంటే, శృతి పక్కనే కూర్చున్న శ్రావణి దేని తర్వాత ఏది చేయాలో చెబుతోంది. అన్నీ శ్రద్ధాభక్తులతో చాలా ఇష్టంగా, ఆసక్తిగా చేస్తోంది శృతి.

"ముత్తయిదువుకు వాయనం ఇవ్వడానికి పులగం, పరమాన్నం, తొమ్మిది బూరెలు విడిగా తీసి పక్కకు పెట్టండి. మిగిలిన పులగం వెండికంచంలో పెట్టండి, దానిపై బెల్లంముక్క వేసి, పప్పు, కూర, పులుసు, పచ్చడి, పెరుగు, ఉప్పు వేయండి. పరమాన్నంగిన్నె, బూరెలు కూడా తీసుకువచ్చి దేవుడి ముందు పెట్టండి. అన్నిపదార్థాలపైన ఆవు నెయ్యి అభికరించండి" అంటూ నాన్‌స్టాప్‌గా అన్నీ చెప్పేసింది అమ్మమ్మ.

"త్వరగా అమ్మవారికి ఆకలి వేస్తుంది" అంటూ తొందరపెట్టింది.

అమ్మమ్మ నైవేద్యం మంత్రం చదువుతుంటే శృతి మహానైవేద్యం పెట్టింది.

"ఇప్పుడు అమ్మవారి దగ్గరనుంచి పువ్వులు, రెండు తోరాలు తీయి. నువ్వు లేచి పిన్నికి పీట వేసి కూర్చోమని చెప్పి వాయనం ఇవ్వు."

శ్రావణి పీటమీద కూర్చున్నాక పసుపురాసి, బొట్టుపెట్టి, మెడకు గంధం రాసింది శృతి.

"కాటుక వున్న అట్లకాడకు చివరలో కొంచెం ఆవునెయ్యి బొట్టు వెయ్యి. నువ్వు కాటుక తీసుకొని పిన్నికి కూడా ఇవ్వాలి. అక్షంతలు ఇవ్వు."

"ముందు పులగం, బూరెలు, పరమాన్నం వాయనం ఇవ్వాలి. ఆ తర్వాత బుట్టవాయనం ఇవ్వాలి– "ఇస్తినమ్మ వాయనం" అంటూ" చెప్పింది అమ్మమ్మ.

శృతి అమ్మమ్మ చెప్పినట్టే చేసింది. శ్రావణి 'పుచ్చుకొంటున్నమ్మ వాయనం" అంది. అలా మూడుసార్లు అన్న తర్వాత "నా చేతి వాయనం ఎవరు పుచ్చుకుంటున్నారు" అని శృతి అడిగింది. "నేనమ్మ మంగళగౌరిని" అంది శ్రావణి.

"నువ్వు కుడిచేతికి తోరం కట్టించుకుని, పిన్ని చేతికి కూడా ఒక తోరం కట్టి గౌరీదేవిని తలచుకుంటూ పిన్ని కాళ్ళకు దణ్ణంపెట్టు."

"........."

"ఇంతటితో పూజ పూర్తయింది. అయిదు జ్యోతులు నువ్వుకానీ, నీ భర్తకానీ తినాలి. వేరే ఎవరికీ పెట్టకూడదు. ఇలా శ్రావణమాసంలో ఎన్ని మంగళవారాలు వస్తే అన్ని మంగళవారాలు చేసుకోవాలి. మధ్యలో ఒకవారం కుదరకపోతే కథ చెప్పుకొని అక్షంతలు వేసుకోవాలి. ఆఖరివారం పదిమంది ముత్తయిదువులకు వాయనాలు ఇవ్వాలి. ఇలా అయిదేళ్ళు చేయాలి. మొన్న నీ పెళ్ళిలో నీకు పిన్ని ఉద్యాపన చేసుకుంది కదా! అలా పెళ్ళికూతురుకి ఉద్యాపన చేసుకోవాలి. సరే! ఇక లేచి అన్నీ సర్దేయండి. భోజనాలు చేసి కొంచెంసేపు విశ్రాంతి తీసుకుంటే మళ్ళీ పేరంటం వేళకు కావాలి" అంటూ ముగించింది అమ్మమ్మ.

** ** **

సాయంత్రం పేరంటాల వేళ....

ఇంటి వాతావరణమంతా ఒక ఉత్సవభరిత సన్నివేశంలా వుంది.

"రెండు తమలపాకులు పెట్టకూడదు. మూడు తమలపాకులు, వక్కపొడి పొట్లం, బత్తాయి, వేయండి. శనగలు మరీ తక్కువ పోయకండి. కొంచెం పెద్దగ్లాసే తీసుకోండి" అంది అప్పుడే నిద్రలేచిన అమ్మమ్మ.

"కవర్లు కట్టడం అయిపోయింది. అలాగే చేసాం. గంధం అత్తరువేసి కలిపాం. కాళ్ళకు రాయడానికి పసుపు కలిపాం. అక్షంతలు పేరంటానికి కావలసినవన్నీ సిద్ధం చేసేశాం. పూలదండలు కూడా చిన్నచిన్న ముక్కలు కట్‌చేసి వుంచాం ముత్తయిదువులకు ఇవ్వడానికి" అని చెప్పింది శ్రావణి.

శ్రావణ మంగళవారం పేరంటాలు చాలా వుంటాయి కాబట్టి- పేరంటాళ్ళు సాయంత్రం నాలుగు గంటలకే ఇళ్ళనుంచి బయల్దేరతారు.

పేరంటాళ్ళు రావడం మొదలుపెట్టారు. వీధి అరుగుమీద కుర్చీ వేసుకుని కూర్చుంది వచ్చినవాళ్ళను పలకరించడానికి శృతి అమ్మమ్మ.

కాళ్ళు కడుక్కుని లోపలకు రావడానికి గేటుపక్కనే బకెట్లతో నీళ్ళు, చెంబు పెట్టారు. అక్కడ కాళ్ళు కడుక్కుని హాల్లోకి వచ్చారు అందరూ. పట్టుచీరల రెపరెపలు, గాజుల గలగలలు, రాళ్ళ నగల ధగధగలు, పలకరింపులు, నవ్వులతో ఇంటికే కళాకాంతులు వచ్చాయి.

పట్టుచీర, వంటినిండా నగలు,తలలో బంగారపు సంపెంగపూలు పెట్టుకొని చేత్తో వెండి టిఫిన్ కారియర్ పట్టుకొని పేరంటానికి వచ్చారు ఇద్దరు ముగ్గురు ముత్తయిదువులు. పేరంటంలో ఇచ్చే శనగలు పోసుకునేందుకు బకెట్, చలిమిడి ఉండలు పెట్టుకోవడానికి టిఫిన్ కారియర్‌లో ఒక వెండిగిన్నె ఉన్నాయి.

శ్రావణి పేరంటాళ్ళ కాళ్ళకు పసుపులురాసింది.శృతి బొట్టుపెట్టి, గంధం రాసింది. తర్వాత కాటుక ఇచ్చి, అక్షంతలు ఇచ్చింది. శ్రావణి అందించిన కవర్లు ఒక్కొక్క ముత్తయిదువుకు ఇచ్చి వాళ్ళ కాళ్ళకు దణ్ణం పెట్టిం.

చాలా పొందికగా వున్న శృతిని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. "అమ్మాయి చక్కగా పద్ధతిగా వుంది. మహానగరంలో పెరిగి, ఉద్యోగం చేస్తూ, అమెరికా వెళ్ళబోతూ కూడా ఇంత శ్రద్ధగా, పెద్దవాళ్ళు చెప్పినట్టు చేయడమంటే మామూలు విషయం కాదు. ఇంతమంది కాళ్ళకు వంగి దణ్ణం పెట్టడానికి ఎవరికి ఒళ్ళు వంగుతోంది. నుంచునే నమస్కారం పెట్టేస్తున్నారు" అన్నారు శృతిని చూసిన పేరంటాళ్ళు. వచ్చిన పేరంటాళ్ళకు డిజిటల్ కెమెరాతో ఫొటోలు తీసింది మధ్యమధ్యలో శృతి.

ఇలా రాత్రి ఏడు గంటల వరకు ముత్తయిదువులు వస్తూనే వున్నారు. ఏమాత్రం అలసట లేకుండా అందరికీ వాయనాలు ఇచ్చుకుంది శృతి. ఏడున్నరకు "మీరు కూడా ఈ వీధిలో వున్న పేరంటాలకైనా వెళ్ళిరండి. పసుపుబొట్టు మానకూడదు" అంది అమ్మమ్మ.

శ్రావణి, శృతి పేరంటానికి వెళ్ళి వచ్చేసరికి రాత్రి పది అయింది.

"నీ కోరిక ప్రకారమే జరిగిందా చిట్టితల్లీ! బాగా అలసిపోయావు. వచ్చే మంగళవారం కూడా అందరినీ పేరంటానికి పిలుస్తావా? లేక అయిదుగురు ముత్తయిదువులకే వాయనం ఇస్తావా?" అంది పక్కన కూర్చున్న మనవరాలి తల నిమురుతూ అమ్మమ్మ.

"వచ్చేవారం, వరలక్ష్మీ శుక్రవారం కూడా ఇలాగే పేరంటం పెడదాం. మూడవ వారం హైదరాబాద్‌లో ఇంతమంది రారు, సరదాగా వుండదు కదా అమ్మమ్మా! వచ్చే సంవత్సరం అయితే అమెరికాలో వుంటాను. అసలే కుదరదు. ఇలా చేసుకోవాలనే కదా ఇక్కడకు వచ్చింది" అంది శృతి.

** ** **

శృతిని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. "అమ్మాయి చక్కగా పద్ధతిగా వుంది. మహానగరంలో పెరిగి, ఉద్యోగం చేస్తూ, అమెరికా వెళ్ళబోతూ కూడా ఇంత శ్రద్ధగా, పెద్దవాళ్ళు చెప్పినట్టు చేయడమంటే మామూలు విషయం కాదు.

రెండవ మంగళవారం కూడా యధావిధిగా మంగళగౌరి నోము చేసుకుంది శృతి. గురువారం ఉదయానికి రాజమండ్రి నుంచి అత్తగారు, మామగారు, ఆడపడుచు, పెద్దమ్మలు వచ్చారు. గురువారం సాయంత్రం అందరూ కలిసి గోస్తనీ నది దగ్గర వున్న అమ్మవారి గుడికి, తాటకేశ్వర స్వామి గుడికి వెళ్ళి వచ్చారు. అప్పుడే శుక్రవారం పేరంటానికి కూడా పిలిచి వచ్చారు.

శ్రావణతగవు కింద పట్టుచీర, కెంపుల సెట్టు, రెండు కిలోల శనగలు, బెల్లం, పసుపు కొమ్ములు, కుంకుమ, పళ్ళు తీసుకువచ్చారు శృతికి.

అమ్మవారి ముఖం పెట్టి అమ్మవారి విగ్రహాన్ని తయారుచేసి, కొత్త పట్టుచీర కట్టింది శృతి. తన నగలు పెట్టింది. చెవులకు బంగారపు ఎర్రరాళ్ళ బుట్టలు పెట్టింది. అచ్చంగా మనిషి కూర్చున్నట్టే వుంది అమ్మవారు. అమ్మవారిని హాల్లో పెట్టారు. అక్కడ అయితే అందరూ కూర్చుని పూజ చేసుకోవడానికి వీలుగా వుంటుందని. పూజ చేయించడానికి బ్రాహ్మణ్ణి పిలిచారు. తొమ్మిదిరకాల పిండివంటలు, రెండురకాల కూరలు, పప్పు, పులుసు, పచ్చడి చేశారు మహానైవేద్యానికి. శ్రావణి, శృతి అత్తగారు, ఆడపడుచు, పెద్దమ్మలు అందరూ కూర్చుని పూజ చేసుకున్నారు. ఒకరికొకరు బూర్లు వాయనం ఇచ్చుకున్నారు.

** ** **

"బాగుంది. మా కోడలు ఒకసారి మళ్ళీ మనందర్నీ ఆరోజుల్లోకి తీసుకెళ్ళింది. చాలామంది పేరంటాళ్ళు వచ్చారు. ఇప్పుడు రాజమండ్రిలోనే మంగళవారాలు ఇంటికి పేరంటానికి పిలవడం తగ్గిపోయింది. ఎంతమంది ముత్తయిదువులు కావాలో అంతమందికి ఇళ్ళకే వచ్చి వాయనాలు ఇచ్చేస్తున్నారు. ఇలా ఊరందరిని పిలవడం, పెద్ద ఎత్తున పేరంటం చేయడానికి ఎవరికి ఓపిక వుంది?" అంది శృతి అత్తగారు. వరలక్ష్మీవ్రతం రోజు రాత్రి.

"మా చిన్నప్పటి విషయాలన్నీ అమ్మ చెప్పేది దానికి. దాంతో దానికి మన సంప్రదాయాలు అంటే ఇష్టం ఏర్పడింది. ఇలాంటివన్నీ చాలా శ్రద్ధగా చేస్తుంది ప్రతీ పండగకి పట్టులంగా, ఓణీ వేసుకొనేది.ఇంట్లోంచి బయటకు వచ్చేది కాదుకానీ, ఇంట్లోనే తిరిగేది. ఎటూ అమెరికా వెళ్ళిపోతున్నాను కదా! వచ్చే సంవత్సరం అక్కడే ఏదో టూకీగా చేసుకోవాలి. అందుకని మొదటి సంవత్సరం ఇక్కడ మన సంప్రదాయం ప్రకారం చేసుకుంటాను. మంగళవారం మా అమ్మ పూజచేయిస్తొంటే రికార్డు చేసుకుంది. ఆ సిడి, పుస్తకం తీసుకెళ్ళి అక్కడ కూడా చేసుకుంటానంది" అంది లక్ష్మి.

కానీ శృతితో రేలంగి రావడం, చాలా ఏళ్ళ తర్వాత మళ్ళీ ఉత్సాహంగా పూజలు చేయడం, నోములు జరుపుకోడం ఒకవైపు సంతోషంగానూ, మరోవైపు విచిత్రంగానూ వుంది శ్రావణికి.

చిన్నప్పటి నుంచి సిటీలో పెరిగి... మూడేళ్ళుగా బెంగుళూరులో జాబ్ చేస్తున్న శృతి ఇక్కడకు వచ్చి ఇంత భక్తిశ్రద్ధలతో నోము నోచుకోవడం ఆశ్చర్యంగా వుంది. ఆ రాత్రి డాబామీద ఇద్దరే కూర్చున్నప్పుడు శృతిని అదే విషయం అడిగింది.

"నిజమే పిన్నీ... నాకు వచ్చిన ఈ ఐడియా గురించి మా బ్యాచ్‌లో వున్న అమ్మాయిలతో చెబితే 'నీదంతా చాదస్తం' అన్నారు. కానీ ఇన్నివేల మంది, లక్షలమది చేస్తున్న పనిలో కేవలం 'చాదస్తం' లేదనిపించింది. ఇది ఆడవాళ్ళమధ్య సాన్నిహిత్యాన్ని పెంచే పండగనిపించింది ఇక్కడకు వచ్చాక, ఇవన్నీ చేస్తున్నాక. నోముల ద్వారా నాకు ఏదో కావాలని దేవుణ్ణి కోరుకోలేదు. నాకు తెలియకుండానే ఒక ప్రశాంతత లభించింది. అమ్మ, అమ్మమ్మ, పిన్నీ, బంధువులు... వీళ్ళతో అనుబంధం వున్న ఇంతమంది ఆడవాళ్ళని కలుసుకునే అవకాశమిచ్చింది. బహుశా నాకు ఈ ఐడియా రాకపోతే ఈ జ్ఞాపకాలు మిగిలేవా!.... ఇప్పుడు అమెరికా వెళ్ళినా... ఇంతమంది ఆత్మీయతలు నాకు తోడుగా వుంటాయి....ఈ నోములు, వ్రతం లేకుండా ఇదంతా సాధ్యమేనా..." అంటూ చిన్నసైజు ఉపన్యాసం ఇస్తూ పోతున్న శృతిని చూసి- "తన పెళ్ళి మండపంలో పట్టులంగా కట్టుకొని డాన్స్ చేసిన మూడేళ్ళ ముద్దుల పాపేనా... ఇంతలా ఎదిగిపోయింది" అనుకుంది శ్రావణి.

మన ఇష్టాయిష్టాలతో ప్రేమయం లేకుండా ఏర్పడే సంప్రదాయాల వెనుక ఏదో పరమార్థం వుంటుంది. తెలిసి చేసినా, తెలియక చేసినా వాటికో ప్రయోజనం వుంటుందని ఎవరో చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. •